క్లుప్తంగా

ఎస్‌డీపీ యంత్రం ప్రారంభం



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్(ఎస్‌డీపీ) యంత్రాన్ని సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ శుక్రవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఈ యంత్రం విలువ రూ.40లక్షలు ఉంటుందన్నారు. యంత్రం సాయంతో రోగి అవసరాన్ని బట్టి ఒకే దాత నుంచి ప్లేట్‌లెట్లను సేకరించవచ్చన్నారు. దీనికి బయట రూ.15 వేల వరకు ఖర్చు అవుతుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా వినియోగించుకోవచ్చని తెలిపారు. హెచ్‌వోడీ ఇమ్రాన్‌అలీ, బ్లడ్‌బ్యాంక్ ఇన్‌చార్జి చందు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్యశిబిరం



నిజామాబాద్ అర్బన్: లయన్స్‌క్లబ్ ఆఫ్ నిజామాబాద్ సహారా ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని మహాలక్ష్మీనగర్‌లో గల ఎస్సీ బాలికల వసతి గృహంలో దంతవైద్యులు కొండ అమర్‌నాథ్, చర్మవ్యాధి నిపుణులు సి.శ్యాంసుందర్‌లు విద్యార్థినులకు, వసతి గృహ సిబ్బందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఇందిరారాణి, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు బి.నర్సింహ, కార్యదర్శి చామకూర ధనుంజయరెడ్డి, తదితరులున్నారు.

బాధితులకు పరామర్శ

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్ కాలనీలో ఇటీవల కురిసిన వర్షాలకు పురాతన ఇళ్లు కూలిపోయింది. గురువారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రపోతున్న సమయంలో ఈ ఘటన జరిగింది. అదృష్టవశాత్తూ ఎవరికీ గాయాలు కాలేదు. శిథిలావస్థలో ఉన్న ఇంటిని ఐద్వా నేతలు పరిశీలించి పరామర్శించారు. బాధితులను ఆదుకోవాలని కోరారు. జిల్లా ఐద్వా అధ్యక్షురాలు అనిత, కార్యదర్శి సుజాత తదితరులున్నారు.

గ్యాస్ సబ్సిడీ ప్రొసీడింగ్ కాపీల పంపిణీ షురూ

నిజామాబాద్ సిటీ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వంట గ్యాస్ సబ్సిడీ ఇస్తోంది. గ్యాస్ సిలిండర్‌పై రూ.500 సబ్సిడీ అందిస్తోంది. అందులో భాగంగా లబ్ధిదారులకు సబ్సిడీకి సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలు పంపిణీకి మున్సిపల్ అధికారులు సిద్ధం చేశారు. ఈ ప్రొసీడింగ్ కాపీలను నేటి నుంచి పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఆధార్ కార్డు చూపించి ఈ ప్రొసీడింగ్స్ తీసుకోవాలని అధికారులు సూచించారు.

ప్రజలందరికి ప్రభుత్వ పథకాలు



ఇందల్వాయి: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇందల్వాయి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్ గౌడ్ అన్నారు. వంట గ్యాస్ సబ్సిడీ పొందిన అర్హులకు సబ్సిడీ పత్రాలను ఇందల్వాయిలో ఆయన శుక్రవారం పంపిణీ చేశారు. పథకాలు అందనివారు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పీడీఎస్‌యూ పోస్టర్ల ఆవిష్కరణ



సిరికొండ: మండల కేంద్రంలో పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభల వాల్ పోస్టర్లు, లోగోను సంఘం నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యు మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ.. ఈ నెల 30న హైదరాబాద్‌లో 50 వసంతాల స్వర్ణోత్సవ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాజీ జిల్లా కార్యదర్శి దామోదర్, సాయారెడ్డి, ఆశిష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భూలక్ష్మి పండుగ

జక్రాన్‌పల్లి: పడకల్‌లో శుక్రవారం భూలక్ష్మి పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గంగ నీటిని తీసుకువచ్చి గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. డప్పు చప్పుల్ల మధ్య భూలక్ష్మీ అమ్మవారిని ఊరేగించారు. అనంతరం ఆలయంలో ప్రతిష్ఠించారు. భూలక్ష్మీ పండుగలో భాగంగా గ్రామస్తులు వనభోజనాలకు వెళ్లారు. నైవేద్యాలు సమర్పించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వీడీసీ సభ్యులు పుప్పాల శ్రీనివాస్, ప్రసాద్, ధను, నందురెడ్డి, సుచిత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- ఆరోగ్య మిత్రలకు హెల్త్‌కార్డులు లేకపోవడం విడ్డూరం
- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్



ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్యశ్రీ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

నిజామాబాద్ సిటీ: ఆరోగ్యశ్రీ విభాగంలో 17 ఏళ్లుగా సేవలందిస్తున్న ఆరోగ్య మిత్రలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతోపాటు వారికి కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో ఆరోగ్యశ్రీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శించారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఆరోగ్యశ్రీ సిబ్బంది చేస్తున్న నిరవధిక సమ్మె 3వ రోజుకు చేరింది. ఈ సమ్మెకు సీఐటీయూ తరఫున మద్దతు ప్రకటించిన అనంతరం నూర్జహాన్ మాట్లాడుతూ.. ఆరోగ్యమిత్రలు అతి తక్కువ వేతనానికే 17 ఏళ్లుగా రాత్రింబవళ్లు సేవలందిస్తున్నారని తెలిపారు. వారికి కనీసవేతనాలు లేవని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్య శ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంచిందని గుర్తుచేశారు. ఆయనా ఆ విభాగంలో సేవలిందిస్తున్నవారిని విస్మరించిందన్నారు. ఆరోగ్యమిత్రులు మరణిస్తే వారికి ఇన్సూరెన్సు సౌకర్యం లేదని విచారం వ్యక్తం చేశారు. హెల్త్‌స్కీంలో పనిచేసే సిబ్బందికి హెల్త్‌కార్డు లేకపోవడం విడ్డూరమని విచారం వ్యక్తంచేశారు. ఆరోగ్యమిత్రులకు డీపీవో హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేవరకు సమ్మె కొనసాగుతుందని తేల్చిచెప్పారు. ఆరోగ్యమిత్ర సిబ్బంది రామాగౌడ్, శ్రావణ్, విజయ, అంబిక, సుమలత, వీరయ్య, రాములు, సుమలత, అఖిల తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



నగరంలో ర్యాలీ తీస్తున్న నాయకులు

నిజామాబాద్‌అర్బన్: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) 50 వసంతాల స్వర్ణోత్సవ సభలను జయప్రదం చేయాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియం నుంచి ధర్నా చౌక్ వరకు శుక్రవారం విద్యార్థి నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నరేందర్, డాక్టర్ కర్క గణేష్‌లు మాట్లాడుతూ.. కామ్రేడ్ జార్జిరెడ్డి, జేసీఎస్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కోలాశంకర్, రంగవల్లి, చేరాలు లాంటి విద్యార్థి అమరవీరుల త్యాగాల పునాదుల మీద పీడీఎస్‌యూ ఉద్యమం నిర్మాణమైందన్నారు. విద్యార్థుల హక్కులు, కామన్ స్కూల్ విధానం కోసం 50 ఏళ్లుగా రాజీ లేని పోరు పీడీఎస్‌యూ చేస్తోందదన్నారు. విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తోందన్నారు. ఈనెల 30న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో భారీ ర్యాలీ నిర్వహించి, ఠాగూర్ ఆడిటోరియంలో స్వర్ణోత్సవ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. జయప్రదం చేయాలన్నారు. నేతలు అనిల్, మహిపాల్, నసీర్, మమత, మంగ, శివకుమార్, సృజన్, నాగేష్, రాజేష్, బబిత్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న రావట్ల నచ్చన్న

నిజామాబాద్‌నాగారం: జక్రాన్‌పల్లి మండలం మునిపెల్లి గ్రామంలో దళితుల భూములను దౌర్జన్యంగా కబ్జా చేస్తున్న 12 మందిపైన చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన సుమారు 50 మంది దళితులు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. అనంతరం నిజామాబాద్ ప్రెస్ క్లబ్‌లో బాధితుడు రావట్ల నచ్చన్న మాట్లాడారు. మాదిగ కులానికి చెందిన నాకు ఒక ఎకరం భూమి ఉన్నదని, కానీ ఆ భూమిని గ్రామానికి చెందిన కొందరు కబ్జా చేస్తూ అందులో శివలింగం ప్రతిష్ఠాపన చేశారని ఆరోపించారు. ఇదేమిటి అని అడిగిన మమ్మల్ని దుర్భాషలాడుతూ దౌర్జన్యానికి పాల్పడుతున్నారన్నారు . పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.జెల్ల మజ్జు, గంగారం, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతాహీసేవపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ధర్పల్లి: మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎన్ఎస్ఎస్ యూనిట్ , స్వచ్ఛభారత్ కమిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి జెండా ఊపి ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలని విద్యార్థులు సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ కాశీరాం, స్వచ్ఛభారత్ కో–ఆర్డినేటర్ ప్రభాకర్, రామచందర్, శ్రీనివాస్ రెడ్డి, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

తడి పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలి

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ పరిధిలో స్వచ్ఛతా–హీ–సేవలు నిర్వహిస్తున్నామని, వాటిలో ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ అదనపు కమిషనర్ శంకర్ సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు డివిజన్లలో స్వచ్ఛతా–హీ–సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. ఇంటిలో నిల్వచేసిన చెత్తను తడి–పొడి చెత్తగా వేరుచేసి మున్సిపల్ వాహనంలో వేయాలన్నారు. రెండు చెత్త బుట్టలను వేర్వేరుగా వినియోగించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. 21వ డివిజన్‌లోని పోలీసు లైన్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తడి, పొడిచెత్తపై అవగాహన కల్పించారు. 44వ డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేశారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్లు నటరాజ్‌గౌడ్, మహేష్, ప్రభుదాస్, శ్రీకాంత్,జవాన్లు,పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు తొర్లికొండ విద్యార్థులు



పోటీలకు ఎంపికైన తొర్లికొండ విద్యార్థులు

జక్రాన్‌పల్లి: తొర్లికొండ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు బాలికల విభాగంలో చిక్కాల శ్రీవర్ధిని, బాలుర విభాగంలో శేఖర్, సుశాంత్‌లు రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ గంగామోహన్ తెలిపారు. వీరు ఈ నెల 21 నుంచి 23 వరకు సిరిసిల్లలో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఎంఈవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

సత్యశోధక్ పాఠశాల విద్యార్థి

సిరికొండ: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు సిరికొండ సత్యశోధక్ పాఠశాలకు చెందిన విద్యార్థి సిద్ధార్థ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రావుట్ల నర్సయ్య తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని పాఠశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

సుద్దపల్లి విద్యార్థినులు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): సుద్దపల్లి శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నళిని శుక్రవారం తెలిపారు. ఎంపికైన వారిలో విద్యార్థినులు సాత్విక, గంగోత్రి, నేహశ్రీ, శ్రావిక, లిఖిత, నిశిత, కీర్తన ఉన్నారు. ప్రిన్సిపాల్ తోపాటు అధ్యాపకులు ఎంపికైన విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు. సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ వనిత, పీడీ అనుష్క, పీఈటీ శ్రీలత, సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్ వేముల మౌనిక తదితరులున్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



వరి పంటను పరిశీలిస్తున్న ఏవో సుధా మాధురి

డిచ్‌పల్లి: వరిలో తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని డిచ్‌పల్లి ఏవో సుధా మాధురి రైతులకు సూచించారు. శుక్రవారం బర్థిపూర్ శివారులో వరి పంటను ఆమె పరిశీలించి మాట్లాడారు. తెగుళ్లు వ్యాప్తి చెందినప్పుడు సొంతంగా కాకుండా వ్యవసాయాధికారులు సూచించిన రసాయన మందులనే వాడాలని సూచించారు. పురుగు మందు దుకాణాల యజమానులు సైతం రైతులకు అవసరం మేరకే మందులు విక్రయించాలని అనవసరపు మందులు అంటగడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బర్థిపూర్ సొసైటీ చైర్మన్ రామకృష్ణ, రైతులు ఈగ నారాయణరెడ్డి, ఈదర పిచ్చయ్య, జంపాని శ్రీనివాస్, పోల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం

నిజామాబాద్ సిటీ: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నేటి(శనివారం) సాయంత్రం 5 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముష్క సుధాకర్ తెలిపారు. పీడీఎస్‌యూ ఏర్పడి 50 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా జిల్లాలోని పూర్వ విద్యార్థులంతా ఒక్కచోట కలిసి తమ అనుభవాలు, ఉద్యమంలో పనిచేసిన విధానం, ప్రస్తుత లక్ష్యం వంటి వాటిపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో పీడీఎస్‌యూ నాయకులు, పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు 'తెలుగు సాహిత్యం– పర్యావరణ దృక్కోణం' సదస్సు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో శనివారం సాహిత్య అకాడమీ, తెయూ తెలుగు అధ్యయన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'తెలుగు సాహిత్యం – పర్యావరణ దృక్కోణం' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు పీఆర్‌వో పున్నయ్య శుక్రవారం తెలిపారు. కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో జరిగే ఈ సదస్సుకు సాహితీ ప్రియులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నట్లు తెలిపారు.

రేపు సన్నాహక సమావేశం

నిజామాబాద్‌నాగారం: చిల్డ్రన్స్ డే సందర్భంగా ఈ నెల 22న జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో ఇందూరు బాలోత్సవ సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు రవీంద్రనాథ్ సూరి, ప్రధాన కార్యదర్శి నర్రా రామారావు, కోశాధికారి కె రామ్మోహన్‌రావు శుక్రవారం తెలిపారు. జన విజ్ఞాన వేదిక, మల్లు స్వరాజ్యం ట్రస్ట్, పెన్షనర్స్ సంఘం సంయుక్తంగా సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని ఆదర్శ(మోడల్) కళాశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ ఎకనామిక్స్ పోస్టుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.దశరథ్ శుక్రవారం తెలిపారు. పీజీటీ ఎకనామిక్స్ సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ, బీఎడ్, టెట్ పరీక్ష అర్హత కలిగి ఉండాలన్నారు. ఈ నెల 23న అభ్యర్థులకు ఇంటర్వ్యూ, డెమో నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో నేరుగా మోడల్ కళాశాలకు వచ్చి ఇంటర్వ్యూ, డెమో ఇవ్వవచ్చన్నారు. పూర్తి వివరాలకు 9948499298 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అమెరికాలో గణేశ్ వేడుకలు



నిజామాబాద్ రూరల్: అమెరికాలోని డెట్రాయిట్ నగరంలో గణేశ్ ఉత్సవాలను ప్రవాస భారతీయులు ఘనంగా జరుపుకున్నారు. గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు నిజామాబాద్ నగరానికి చెందిన యలమంచిలి సాయి తేజ మాట్లాడుతూ.. మన దేశ సంస్కృతీ సాంప్రదాయాలను గౌరవిస్తూ పండుగలను ఘనంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. సాయి తేజ ఆయన స్నేహితులు వేలం పాటలో రూ.1.25,000 వేలకు లడ్డూను దక్కించుకున్నారు.

డీసీఎంఎస్ చైర్మన్‌కు సన్మానం



సన్మానిస్తున్న పీఏసీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు

సుభాష్ నగర్: డీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ను పీఏసీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ తరపున సొసైటీ కార్యదర్శులు శుక్రవారం నగరంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ నాగేష్, ఏబీఎం చిన్నన్న, సీఈవోలు నర్సయ్య, వంశీ, సాయిచంద్, కృష్ణ, నంబూద్రిపాద్, తదితరులు పాల్గొన్నారు.

నేటి చిత్రం



గంగాస్థాన్ నుంచి నిజామాబాద్‌కు వచ్చే దారిలో డివైడర్లపై మొలిచిన పిచ్చి మొక్కలు

డివైడర్లపై పిచ్చిమొక్కలు

నగరంలోని గంగాస్థాన్ నుంచి నిజామాబాద్‌కు వచ్చే దారిలో డివైడర్లపై పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. పిచ్చిమొక్కలను తొలగించి పువ్వుల మొక్కలను ఏర్పాటు చేయాలని, అలాగే వీధిలైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

సీఎంని విమర్శిస్తే సహించేది లేదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

డిచ్‌పల్లి: ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసి చూపిస్తున్న సీఎం రేవంత్ రెడ్డిని అనవసరంగా విమర్శిస్తే సహించేది లేదని డిచ్‌పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్ హెచ్చరించారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. తెలంగాణ సెక్రటేరియట్ ఎదుట మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటుపై గగ్గోలు పెడుతున్న బీఆర్ఎస్ నాయకులు ఇంతకాలంగా తెలంగాణ తల్లి విగ్రహం పెట్టడం ఎందుకు మరిచిపోయారని విమర్శించారు. మాజీ ప్రధానులు ఇందిర, రాజీవ్‌లు దేశం కోసం తమ ప్రాణాలు త్యాగం చేశారని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమం సమయంలో మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, మాజీ జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్మోహన్ ఎక్కడున్నారని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదవుల కోసం బీఆర్ఎస్ లో చేరారని విమర్శించారు. రేవంత్ రెడ్డిని విమర్శిస్తే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. నాయకులు వాసుబాబు, ధర్మాగౌడ్, సొసైటీ చైర్మన్ రామకష్ణ, మాజీ సర్పంచులు జగదీశ్, మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మానసికంగా దృఢంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ రవితేజ

నిజామాబాద్‌అర్బన్: సూర్య ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం వాగ్దేవి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మానసిక ఒత్తిడి ఏ విధంగా అధిగమించాలి అనే విషయంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మానసిక వైద్య నిపుణులు రవితేజ మాట్లాడుతూ.. ఈ రోజుల్లో యువత ఒత్తిడిని తట్టుకోలేక చెడు వ్యసనాలకు గురవుతోందని, చనిపోవడానికి సైతం సిద్ధపడుతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరు మానసికంగా దృఢంగా ఉండాలని, అవసరాన్ని బట్టి ఇతరుల సహాయాన్ని తీసుకోవడంలో తప్పు లేదన్నారు. ఒత్తిడిని జయించడానికి ఏరోబిక్ ఎక్సర్‌సైజ్‌లను విద్యార్థులతో చేయించారు. మానసిక ఒత్తిడికి లోనైనప్పుడు 14416 నంబర్‌కి సంప్రదించి సహాయం పొందాలన్నారు. అనంతరం జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ స్వామి సులోచన మాట్లాడారు. సంస్థ కార్యనిర్వహణ అధికారులు రాజేంద్రకుమార్, విక్రమ్, వినోద్ కుమార్,ప్రిన్సిపాల్ రవీందర్ రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నిజామాబాద్‌నాగారం: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నిజామాబాద్ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ అంకిత్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రానున్న మున్సిపల్, గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు ఈ సవరణ చేసి రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగంధుల మురళీ, జిల్లా అధికార ప్రతినిధి అమంద్ ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	160
		లైవ్	100
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	75,300	వెండి (కిలో)	92,000
22 క్యారెట్స్	69,467		


– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	28	50	గాజరుగడ్డ	40	70
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	25	50
బీరకాయ	50	80	దోసకాయ	25	50
దొండకాయ	40	60	ఆలుగడ్డ	30	50
బీర్నిసుకాయ	60	90	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	80	గోబిపువ్వు	50	75
వంకాయ	30	60	బీట్‌రూట్	30	50
పాలకూర	70	110	కరివేపాకు	40	60
మెంతికూర	90	140	చామగడ్డ	40	60
కొత్తిమీర	80	120	గోరుచిక్కుడు	30	50
పుదీనా	80	120	చిక్కుడుకాయ	70	100
క్యాప్సికం	50	75			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	35: చిన్నకథ కాదు (తెలుగు)-4.30, మత్తు వదలరా(తెలుగు)- 7.20 10.25
స్క్రీన్-2	సరిపోదా శనివారం (తెలుగు) - 1.30 7.25
స్క్రీన్-3	ట్రాన్స్‌ఫార్మర్స్ (ఇంగ్లీష్ 3డీ) - 11.00, 4.40, 10.35, ప్రేమనగర్ (తెలుగు) - 7.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఫైలం పిలగా(తెలుగు)-1.15, మత్తు వదలరా-2-4.00,7.00, 10.00
స్క్రీన్-2	ట్రాన్స్‌ఫార్మర్స్ వన్(3డీ ఇంగ్లీష్) - 11.00, 4.35, యుద్ర (హిందీ) - 1.30, 7.05 స్త్రీ - 2 (హిందీ) - 10.10
స్క్రీన్-3	35 : మత్తువదలరా-2 -1.15, సరిపోదా శనివారం - 4.15 10.30, తుంబడ్ (హిందీ) - 7.50
స్క్రీన్ -4	చిక్లెట్స్ (తెలుగు)-9.55, తుంబడ్(హిందీ) - 12.35, యుద్ర(హిందీ)-3.15, ప్రేమాభిషేకం-6.20, ప్రేమనగర్(తెలుగు)-10.10
లలితామహల్	సరిపోదా శనివారం (తెలుగు)
దేవి	మత్తు వదలరా-2 (తెలుగు)
నటరాజ్	యుధ్ర (హిందీ)
విజయ్	ఎ.ఆర్.ఎం 3డీ (తెలుగు)